క్లుప్తంగా

క్షీరాభిషేకం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం పీహెచ్‌సీ కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ కాంట్రాక్టు వైద్య ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. దీంతో ఉద్యోగులు కృతజ్ఞతగా సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

రెంజల్ లైబ్రేరియన్ బదిలీ

రెంజల్(బోధన్): రెంజల్ శాఖా గ్రంధాలయంలో పనిచేసిన లైబ్రేరియన్ రాజేశ్వర్ బదిలీ అయ్యారు. 11 సంవత్సరాలుగా ఆయన ఇక్కడ పనిచేశారు. పదోన్నతిపై జిల్లా కార్యాలయానికి వెళ్లారు. శుక్రవారం పలువురు పాఠకులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఆయన వల్లే ప్రభుత్వ కొలువు సాధించినట్లు ఇద్దరు ఉద్యోగులు వివరించారు.

భూమి పూజ

వర్ని: నెహ్రూ నగర్ గ్రామంలో జనరల్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి వర్ని ఎంపీపీ మేక శ్రీ లక్ష్మీ వీర్రాజు శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.15 లక్షలతో ఫంక్షన్ హాల్ నిర్మించనున్నారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పోచారం సురేందర్ రెడ్డి, నెహ్రూ నగర్ సర్పంచ్ ఉండవల్లి నాని బాబు, గిరి పాల్గొన్నారు.

గోవూర్‌లో అభివృద్ధి పనులకు..

రుద్రూర్: మోస్రా మండలం గోవూర్ గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు శుక్రవారం బీఆర్ఎస్ నేత పోచారం సురేందర్ రెడ్డి భూమి పూజ చేశారు. గ్రామంలో మరిగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు, అంగన్వాడీ, డ్వాక్రా సంఘ భవనాలకు రూ.20 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. జెడ్పీటీసీ గుత్ప విజయ భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బాల్కొండ: నాగాపూర్, జలాల్‌పూర్, బస్సాపూర్ గ్రామాల్లో బాల్కొండ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ సురాజీరెడ్డి ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తుందన్నారు. సర్పంచ్‌లు లింభన్న, కల్పన, కళ్యాణి, ఎంపీటీసీ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

రూ. 25 వేల విరాళం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం స్థానిక దాత చింత నాగారాజు, మానస దంపతులు రూ.25 వేలు విరాళం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. బద్రి, చింత గణేష్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

నవీపేట: మండల కేంద్రంలో చైల్డ్‌ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత హెచ్‌ఐవీ, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఈ రెండు వ్యాధులతో మారుమూల గ్రామాలలోని రోగులు బాధపడుతున్నారని, నిర్ధారణ లేక అవస్థలు ఎదుర్కొంటున్నారని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ వడ్డే రవి ఈ సందర్భంగా పేర్కొన్నారు. సంత జరిగే ప్రతి గ్రామంలో ఈ వ్యాధులపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

'నిర్లక్ష్యం వల్లే నష్టపోయారు'

భీమ్‌గల్: వరి కోతలు కోసి సుమారు 40 రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సమయానికి కొనుగోలు చేయకపోవడం వల్లనే అకాల వర్షాలకు వరి ధాన్యం తడిసి, మొలకలు వచ్చి రైతులు నష్ట పోయారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటీ మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మండలంలోని గోన్‌గొప్పుల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. రైస్ మిల్లర్లు, స్థానిక సొసైటీ కేంద్రాలతో కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు క్షేత్ర స్థాయిలో పర్యటించకుండా, ఆత్మీయ సమ్మేళనాలతో సంబురాలు చేసుకుంటున్నారని విమర్శించారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

ఆర్మూర్: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు భరోసా కల్పిస్తూ జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సింది పోయి తనకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సరైంది కాదని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు రైతుల వద్దకు వెళ్లి ఓదార్చిన సంఘటన ఒక్కటీ లేదన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించాల్సిన కలెక్టర్, అధికారులు సైతం పంట నష్టాన్ని లెక్కలు వేస్తున్నారు తప్ప రైతులకు మనోధైర్యాన్ని కల్పించే పనులు మాత్రం చేయడం లేదని ఆమె విమర్శించారు.

కార్పొరేట్‌కు పంచి పెడుతున్నారు

ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను పెంచి పేద ప్రజలను దోచుకుంటూ కార్పొరేట్ శక్తులకు పంచి పెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆరోపించారు. ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీకో హటావో.. దేశ్‌కో బచావో నినాదంతో సీపీఐ జీపు జాత నిర్వహించారు. సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు ఆధ్వర్యంలో జాతను నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ అవగాహన కల్పించారు.

విస్తరణకు రాజకీయ గ్రహణం

- ముప్కాల్ మండల కేంద్రంలో ముందుకు సాగని రోడ్డు వెడల్పు పనులు
- అధికార పార్టీ నేతల మధ్య ఆధిపత్య పోరు
- 42 ఫీట్లు అంటూ ఓ వర్గం.. 40 ఫీట్లు అని మరో వర్గం


ముప్కాల్ మండల కేంద్రంలో నిలిచిపోయిన రోడ్డు వెడల్పు పనులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. ఫలితంగా రోడ్డు వెడల్పు పనులు కొంత కాలంగా ముందుకు సాగడం లేదు. మండల కేంద్రంలో అధికార పార్టీలో రెండు వర్గాలు ఆధిపత్యం కోసం కాలు దువ్వుకుంటున్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో తమదే చెల్లాలని రెండు వర్గాల వారు పట్టుబట్టారు. దీంతో అధికారులు ఏం చేయాలో తేల్చుకోలేక పనులనే నిలిపి వేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డ మధ్యలో నుంచి 55 ఫీట్ల రోడ్డును రెండు వైపులా వెడల్పు చేయటానికి, సెంట్రల్ లైటింగ్ పనులకు ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. కాని మండల కేంద్రంలో ఇరువైపులా పెద్ద భవంతులు కొన్ని ఉండటం వల్ల కొద్ది మేర వెడల్పు తగ్గించి నిర్మాణం చేపట్టాలని అధికారులు ఆలోచన చేశారు. కాని అధికార పార్టీలోని ఓ ప్రజా ప్రతినిధి 42 ఫీట్ల వెడల్పు వదిలేసి మురికి కాలువను నిర్మించారు. దీంతో మరో వర్గానికి చెందిన అధికారి పార్టీ ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు 40 ఫీట్లు ఉండాలని తమ అవసరాల కోసం అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ముందుగా 42 ఫీట్లు ఖాయం చేద్దామనుకున్న ప్రజా ప్రతినిధి సమస్యను వీడీసీకి మధ్యలోకి తీసుకెళ్లి పంచాయతీ పెట్టాడు. దీంతో వీడీసీ కలుగ జేసుకుని 42 ఫీట్లు కాదు 40 ఫీట్లు కాదు 45 ఫీట్ల వెడల్పు చేయాలని తీర్మానం చేశారు. రోడ్డు వెడల్పు పనులపై రాజకీయం చేస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 55 ఫీట్ల రోడ్డును నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో కాంట్రాక్టర్ నుంచి అధికారి పార్టీ నాయకులు ముడుపులు కూడా అందుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు వెడుల్పు పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే పనులు ప్రారంభిస్తాం

ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులను వెంటనే ప్రారంభిస్తాం. కాంట్రాక్టార్‌కు వేరే చోట పనులు ఉండటం వల్ల పనులు నిలిపేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం రోడ్డు వెడల్పు పనులు చేపడుతాం. ఎవరి ఒత్తిడి లేదు. – రవీందర్ రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈఈ, బాల్కొండ

45 ఫీట్ల వెడల్పునకు తీర్మానం

ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనుల్లో ఎవరికి నష్టం కలగకుండా ఉండాలని భావించి 45 ఫీట్ల వెడల్పు చేయాలని తీర్మానం చేశాం. పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

– కంచు విజయ్, వీడీసీ చైర్మన్

ఘనంగా బుద్ధ పౌర్ణిమ


ఆర్మూర్ టౌన్: బుద్ధ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళితులు, బీఆర్ఎస్ నేతలు



బోధన్ టౌన్: సావిత్రి దేవి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలోని సావిత్రి దేవి పిరమిడ్ కేంద్రంలో శుక్రవారం ఘనంగా బుద్ధ పౌర్ణిమ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి హాజరై మాట్లాడారు. ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలు అలాగే బుద్ధుడి జ్ఞాన సందేశం గురించి వివరించారు.

దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

మోర్తాడ్: మోర్తాడ్‌లో దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుద్ధ పూర్ణిమ కార్యక్రమం నిర్వహించారు. బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లూరి రాజారాం పాల్గొన్నారు.

మాదిగ సంఘాల ఆధ్వర్యంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుద్ధుడి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని హౌసింగ్‌బోర్డు పార్కులో గల బుద్ధ విగ్రహానికి పూలమాల వేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన వీవోఏల సమ్మె


ముప్కాల్‌లో సమ్మె చేపడుతున్న వీవోఏలు


రుద్రూర్: మద్దతు ప్రకటిస్తున్న మహిళ సమాఖ్య సభ్యులు

డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాలకు పలు పార్టీల నాయకులు చేరుకుని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లాలో పలు చోట్ల పాటలు పాడుతూ, మోకాళ్ల నిలబడి వీవోఏలు నిరసన తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


వర్ని: మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు


రెంజల్‌లో మోకాళ్ల పై నిలబడి నిరసన


పంచాయతీ కార్మికుల సమ్మె ప్రారంభం

తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ కారోబార్లు, పారిశుధ్య సిబ్బంది శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కారోబార్‌లను, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించి, కనీస వేతనం రూ.21,500 ఇవ్వాలన్నారు. అలాగే జీపీలలో పనిచేస్తున్న సిబ్బంది అందరికి జీవో–51ను సవరించి కనీస వేతనం రూ.15,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, జీపీల నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


ఏర్గట్లలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు


కమ్మర్‌పల్లిలో..


నందిపేటలో..


మాక్లూర్‌లో..


బాల్కొండ మండల కేంద్రంలో..


రుద్రూర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద ..


వేల్పూర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద..

చెరువు మట్టి తరలించటానికి అనుమతివ్వండి



బాల్కొండ: మండల కేంద్రంలోని పెద్ద చెరువు నుంచి మట్టిని తరలించటానికి అనుమతివ్వాలని వీడీసీ సభ్యులు స్థానిక తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. చెరువులో పూడిక మట్టిని తరలించి నేలల్లో పోషకాలను పెంచుకుంటామన్నారు. అధికారుల పర్యవేక్షణలోనే తవ్వకాలు చేపడుతామని విన్నవించారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ తెలిపారు. వీడీసీ అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

సాధారణ కాన్పులకు ప్రాధాన్యత..

బోధన్‌టౌన్(బోధన్): శస్త్ర చికిత్సలను తగ్గించి సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలని మిడ్వైఫరీలు అన్నారు. జాతీయ మిడ్వైఫరీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బోధన్ జిల్లా ఆస్పత్రికి ముగ్గురు మిడ్వైఫరీలను సాధారణ కాన్పులను పెంచడానికి కేటాయించారు. ఈ సందర్భంగా మిడ్వైఫరీలు గర్భిణీలకు ఏఎన్‌సీ వ్యాయామాలు, సాధారణ ప్రసవం వల్ల కలిగే లాభాలు, తల్లి పాల ప్రాముఖ్యత, ప్రసవ బంతి వ్యాయామాలను గురించి అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి



బోధన్‌రూరల్(బోధన్): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొంటున్న ధాన్యం రైసుమిల్లలకు తరలింపు, రైసుమిల్లుల్లో ధాన్యం అన్‌లోడింగ్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలని బోధన్ తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ వరప్రసాద్ పలు రైసుమిల్లులను తనిఖీ చేసి ధాన్యం సేకరణను పరిశీలించారు. రైస్‌మిల్లర్లు ధాన్యంతో వచ్చే లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడింగ్ చేయాలన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఆలయాల్లో డీసీసీబీ చైర్మన్ పూజలు

రుద్రూర్ : చందూర్ మండల కేంద్రంలో, చందూరు మండలం కారేగాం తండాలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శుక్రవారం పర్యటించి పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కారేగాం తండాలో నూతనంగా నిర్మించిన హన్మాన్ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. సర్పంచ్‌లు దేవిసింగ్, కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

ప్రొబేషన్ ముగిసినందున పర్మినెంట్ చేయండి



బోధన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ ఆఫీస్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. తమ నాలుగేళ్ల ప్రొబేషన్ కాలం ముగిసినందున పర్మినెంట్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.

సమ్మెకు మద్దతు

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో మోస్రా, చందూర్ మండలాలకు చెందిన జేపీఎస్‌లు చేస్తున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం చందూర్ వైస్ ఎంపీపీ దశాగౌడ్ సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కారుణ్య నియామకాలు చేపట్టాలని, 317 జీవో వల్ల నష్టపోయిన వారికి న్యాయం చేయాలని అన్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి


రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

నవీపేట : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని నాగేపూర్, అబ్బాపూర్(బి) గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యం రాశులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సొసైటీల కార్యదర్శుల నిర్లక్ష్యంతోనే తేమ వచ్చిన ధాన్యాన్ని కొనడం లేదని, సంబంధిత కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను వెంటనే తరలించడం వీలుకాపోతే స్థానిక రైతువేదికలలో నిల్వ చేయాలని సూచించారు. లారీల నుంచి అన్‌లోడ్ చేయని రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల పంటలను కొనుగోలు చేయాలి


డీసీవోకు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ చైర్మన్


తాడ్‌బిలోలిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ సొసైటీ పరిధిలోని ముంపు గ్రామాల్లో పండించిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సొసైటీ చైర్మన్ బార్ల భరత్ రాజ్‌రెడ్డి కోరారు. ఈ ఆయన ఆధ్వర్యంలో రైతులు, డీసీవో సింహాచలంను కలిసి వినతిపత్రం అందజేశారు. జీజీ నడ్కుడ, గాదెపల్లి, అన్నారం, సిర్పూర్, నూత్‌పల్లి, డొంకేశ్వర్, నికాల్‌పూర్, కోమట్‌పల్లి, తదితర గ్రామాల్లో వరిని పండించినట్లు తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరారు.

తరుగు లేకుండా కొనుగోలు చేయాలి

రెంజల్(బోధన్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలతో తడిసి ముద్దయి మొలకలు వచ్చిన ధాన్యాన్ని తరుగు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని మండల రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడ్‌బిలోలి, సాటాపూర్, బోర్గాం, నీలా గ్రామాల్లో మండల కమిటీ ప్రతినిధుల బృందం పర్యటించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పుట్టి నాగన్న, రాజేశ్వర్, నసీర్, ఒడ్డెన్న, పెద్దులు, గంగాధర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు నివారించొచ్చు


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

ఆర్మూర్‌టౌన్: రైతులు, వినియోగదారులు విద్యుత్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు నివారించవచ్చని ఆర్మూర్‌టౌన్–2 ఏఈ ఆశ్రితారెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలకు విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ వినియోగం సమయంలో ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

విద్యుత్ పొదుపుతోనే బిల్లుల నియంత్రణ

మాక్లూర్: బిల్లుల నియంత్రణ అనేది విద్యుత్‌ను పొదుపుగా వాడినప్పుడే సాధ్యపడుతుందని మాక్లూర్ విద్యుత్ శాఖ ఏఈ గోపి నాయక్ అన్నారు. శుక్రవారం మాక్లూర్, మాదాపూర్, గంగరమంద, సింగంపల్లి గ్రామాలలో నేటి విద్యుత్ ఆదా రేపటి విద్యుత్ మిగులు అనే అంశంతో పాటు, విద్యుత్ భద్రతపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రతి వినియోగదారుడు ముందుగా విద్యుత్‌ను పొదుపుగా వాడటం అలవాటు చేసుకోవాలన్నారు.

జిల్లా ఏర్పడే వరకు ఉద్యమం ఆగదు


దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసే వరకు ఉద్యమం ఆగదని న్యాయవాదులు స్పష్టం చేశారు. ప్రత్యేక జిల్లా డిమాండ్ తో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 138వ రోజుకు చేరాయి. న్యాయవాదులు గంగారెడ్డి అర్జున్ రాందర్, తదితరులు కూర్చున్నారు.

ఆధ్యాత్మికం..

ముగిసిన శ్రీరామ మహాయజ్ఞం



రెంజల్(బోధన్): కందకుర్తిలోని సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో విగ్రహ ప్రతిష్ఠాపన, పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. వారం రోజులుగా సేవాశ్రమంలో నిత్యం పూజ, యజ్ఞం, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజున పూర్ణాహుతి నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు సీతారాం మహరాజ్ భక్తులు విరాళాలతో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందాంబ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

నిమిషాంబ దేవి ఆలయంలో..

బాల్కొండ మండల కేంద్రంలో నకాశీ సంఘం ఆధ్వర్యంలో నిమిషాంబ దేవి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో..

మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మాస పూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా 5న ఆలయంలో మాస పూజోత్సవం చేస్తారు.

గంగామాత ఆలయ వార్షికోత్సవం



వేల్పూర్: పడగల్‌లో శుక్రవారం స్థానిక గంగపుత్రులు, గంగామాత మందిరం ఆరవ వార్షికోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజలు చేశారు. గంగపుత్ర వీధిలోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం నుంచి మహిళలు మంగళహారతులతో బోనాలను గంగామాత ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య పాల్గొన్నారు.

దత్తాపూర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని దత్తాపూర్‌లో గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం హనుమాన్ మూల విరాట్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే నవగ్రహాలు, ఇతర దేవతా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూజలు చేశారు.

హనుమాన్ ఆలయాల్లో అన్నదానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రియ సమాజ్‌కు చెందిన హనుమాన్ ఆలయంలో, రెడ్డిగార్ల హనుమాన్, దార్ల హనుమాన్ ఆలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ప్రతినెల పౌర్ణమి రోజు హనుమాన్ ఆలయంలో అన్నదాన చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899